ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 17 | జూన్ | 2024
పేజీలు 8

## కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ముజామిల్ ఖాన్



2 లో

# ఆకాశం వైపు.. రైతన్న చూపు..!



- -చినుకులతో పదును కాని భూములు
- -ఆలస్యమవుతున్న ఖరీఫ్
- -వెలవెలబోతున్న సాగునీటి వనరులు



మృగశిర కార్తె పూర్తి కావస్తున్నా ఇంత వరకు సరైన వర్షం కురవలేదు. మబ్బులు పట్టడం, అక్కడ, ఇక్కడ చిరుజల్లులతో కూడిన మాదిరి వర్షం కురవడం తప్ప పదునైన వాన ఇంత వరకు కురిసిన దాఖలాలు లేవు. గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇబ్బంది పడ్డ రైతులు ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఎదురవుతుందా అన్న ఆందోళనలో ఉన్నారు.

-ప్రజాపక్షం/ఖమ్మం

2 లో

# కరెంటుపై గ్రామ సభలు



- -కక్ష సాధింపు కాదు
- -మాజీ మంత్రి కోరిక మేరకే న్యాయ విచారణ
- -రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన
- -ఖమ్మం పర్యటనలో మల్లు భట్టివిక్రమార్క

ప్రజాపక్షం/ ఖమ్మం : విద్యుత్ సరఫరా అంశాలకు సంబంధించి వివరాలు తెలుసుకునేందుకు గ్రామ స్థాయి సభలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వంలో విద్యుత్ కొనుగోళ్లు ఇతర అంశాలకు సంబంధించి న్యాయ విచారణ కక్ష సాధింపు కాదని గతంలో విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేసిన జగదీష్ రెడ్డి అసెంబ్లీలో కోరిన మేరకే న్యాయ విచారణకు ఆదేశించామని ఆయన తెలిపారు. ఆదివారం భట్టి విక్రమార్క ఖమ్మంజిల్లా బోనకల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలు రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో లోపం ఉంటే 1912 నెంబరుకు ఉచితంగా ఫోన్ చేయవచ్చునన్నారు. కాల్ సెంటర్‌కు ఫిర్యాదు అందిన

మిగతా 2లో..

# ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఆలోచనలు




- -మేధావుల మౌనం ప్రమాదకరం
- -ప్రోగ్రెసివ్ ఫోరం సమావేశంలో ప్రొ॥ యుగల్ రాయలు



ప్రజాపక్షం/ ఖమ్మం : ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మేధావుల ఆలోచనలు సాగాలని నాగపూర్ యూనివర్సిటీ ప్రొ॥ యుగల్ రాయలు తెలిపారు. మేధావులు కొందరు రాజకీయ, ఆర్థిక లక్ష్యాలను ఎంచుకుని తమ ఆలోచనలను విక్రయిస్తున్నారని ఈ క్రమంలోనే ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం ఖమ్మంజిల్లా స్థాయి సమావేశం ఆదివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన యుగల్ రాయలు మాట్లాడుతూ గతంలో

మిగతా 2లో..

# ఆకాశం వైపు.. రైతన్న చూపు..!

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మృగశిర కార్తె పూర్తి కావస్తున్నా ఇంత వరకు సరైన వర్షం కురవలేదు. మబ్బులు పట్టడం, అక్కడ, ఇక్కడ చిరుజల్లులతో కూడిన మాదిరి వర్షం కురవడం తప్ప పదునైన వాన ఇంత వరకు కురిసిన దాఖలాలు లేవు. గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇబ్బంది పడ్డ రైతులు ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఎదురవుతుందా అన్న ఆందోళనలో ఉన్నారు. గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులు ఈ ఏడాదైనా కాలం కలిసి రాక పోతుందా అన్న ఆశతో సాగు మొదలెట్టారు. వాతావరణ శాస్త్రవేత్తలు అదిగో ఇదిగో నైరుతి రుతుపవనాలు వచ్చేస్తున్నాయి అన్నారు తప్ప వాటి జాడ కనిపించడం లేదు. గడిచిన నాలుగైదు రోజులుగా ఎండలు మృగశిర లోను రోహిణి కార్తెను తలపిస్తున్నాయి. సాయంత్రానికి మబ్బులు పట్టడం నాలుగు చినుకులు పడటం తప్ప వేసవి దుక్కులు పదునయ్యే రీతిలో వర్షాలు కురవ లేదు. పునాస పంటలకు సమయం మించి పోతుందని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. సకాలంలో వర్షాలు పడితే మృగశిరకార్తె పంట మొక్కలతో భూములు పచ్చ రంగు పులుముకోవాల్సి ఉంది. కాని ఆ పరిస్థితి లేదు. కొందరు వచ్చిపోయే చినుకులకు దుక్కులు సిద్ధం చేసి విత్తనాలు నాటారు. ఇప్పుడు వారి పరిస్థితి చాలా ఇబ్బంది కరంగా ఉంది. ఇక సాగునీటి వనరులను పరిశీలిస్తే సాగునీటి వనరుల్లో చుక్క నీరు లేదు. చెరువులు, కుంటలు వెలవెలబోతున్నాయి. మధ్యతరహా ప్రాజెక్టుల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. ఖమ్మంజిల్లాలోని పాలేరు, వైరా, లంకా సాగర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసాని, తాలిపేరు, పెద్దవాగు ప్రాజెక్టులలోకి సైతం ఈ ఏడాది నీరు చేరలేదు. గతేడాది పంటలకే నీటిని అందించలేకపోయినా ఈ ప్రాజెక్టులలోకి కొత్త నీరు చేరలేదు. ఖమ్మం జిల్లాలో 2.50 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్న నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిస్థితి దయనీయంగా ఉంది. కనిష్ట నీటి మట్టానికి చేరుకోవడంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. ముఖ్యంగా కౌలు రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గతంలో పంట పండిన తర్వాత కౌలు చెల్లించే పద్ధతి ఉండేది. కాని వాణిజ్య పంటలు సాగు చేస్తున్న నేపథ్యంలో ముందస్తు కౌలు చెల్లింపు తర్వాతే కౌలు రైతులు వ్యవసాయాన్ని ప్రారంభించాల్సి వస్తుంది. ఇప్పటికే కౌలు చెల్లించి దుక్కులు సిద్ధం చేసిన రైతులు నష్టపోవాల్సి వస్తుందన్న ఆవేదనతో ఉన్నారు.

**సీతారామపై ఆశలు...**

కృష్ణా, గోదావరి జీవనదులే అయినా కృష్ణా నది పై నాగార్జున సాగర్ ఎగువన పలు ప్రాజెక్టుల నిర్మాణం జరగడంతో దిగువన ఉన్న సాగర్‌కు నీళ్లు రావడం లేదు. తెలంగాణ రాష్ట్రానికి ఇప్పుడు పెద్ద దిక్కుగా గోదావరి మారింది. గోదావరి నుంచి 70 టిఎంసిల నీటిని ఎత్తిపోసే విధంగా రూపకల్పన జరిగిన సీతారామ ప్రాజెక్టుపై ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రజలు ఆశలు పెంచుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాకు చెందిన మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీతారామ పై ప్రత్యేక దృష్టి సారించారు. నీటిని ఎత్తిపోయడమే గాక ఏన్కూరు నుంచి రాజీవ్ కెనాల్ ద్వారా నాగార్జున సాగర్ కాలువకు అనుసంధానం చేయనున్నారు. ఈ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. ఆగస్టు 15 నాటికి ఈ కాలువ ద్వారా నీటిని వదలాలన్న లక్ష్యం నెరవేరితే నాగార్జున సాగర్ ఎడమ కాలువకు అనుసంధానం చేయబడిన వైరా, లంకా సాగర్ మధ్య తరహా ప్రాజెక్టులకు సాగునీటి కొరత తీరడంతో పాటు నాగార్జున సాగర్ ఎడమ కాలువ రెండవ, మూడవ జోన్లకు సాగునీటి సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. కృష్ణా నది కంటే గోదావరి నదిలో నీటి లభ్యత ఎక్కువగా ఉంది. రాష్ట్ర విభజన తర్వాత సైతం వందలాది టిఎంసిల నీరు సముద్రంలో కలుస్తుంది. సాగునీటి కొరత లేనందున ఉమ్మడి జిల్లా రైతాంగం సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న ఆశతో ఉన్నారు. వరణుడు కరుణించక పోతే ఈ ఏడాది రైతాంగం మరింతగా నష్టపోవాల్సిందే.



## విస్తరణే లక్ష్యంగా భవిష్యత్ కార్యాచరణ

**-గ్రామస్థాయి నుంచి సైద్ధాంతిక శిక్షణ**
**-స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రత్యేక దృష్టి**
**-సిపిఐ జిల్లా కౌన్సిల్‌లో హేమంతరావు**






**ప్రజాపక్షం/ ఖమ్మం :** పార్టీ బలోపేతం, విస్తరణే లక్ష్యంగా రూపొందించిన ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగి సత్ఫలితాలను సాధించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు కోరారు. ప్రతి కార్యకర్తకు రాజకీయ సైద్ధాంతిక అవగాహన ముఖ్యమని అందు కొరకు గ్రామస్థాయి నుండి సైద్ధాంతిక అవగాహన కలిగించేందుకు శిక్షణా తరగతులను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం బిజి క్లెమెంట్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో ప్రత్యేక రాజకీయ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. బిజెపిని ఇంటికి పంపించేందుకు దేశ ప్రజలు సిద్ధమయ్యారని ఇండియా కూటమిలో నెలకొన్న అనివార్య పోటీలు బిజెపి మిత్ర పక్షాలు కొన్ని రాష్ట్రాలలో మంచి ఫలితాలు సాధించడం మోడీ అధికారం చేపట్టేందుకు కారణమైందన్నారు. బిజెపి రామనామం, అయోధ్య నినాదాలు పని చేయలేదని హేమంతరావు తెలిపారు. రాష్ట్రంలో ప్రజల చూపు ఇప్పుడు రుణమాఫీ పై ఉందని రుణమాఫీ విధి విధానాలు రూపకల్పనకు ముందు ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునే ఆలోచన చేయాలని, హామీ నెరవేరడమే లక్ష్యంగా రుణమాఫీ నియమ, నిబంధనావళి ఉండాలని హేమంతరావు సూచించారు. పార్టీ కార్యకర్తలు స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఆందోళనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని పార్టీ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో 14, 15 తేదీలలో నిర్వహించిన శిక్షణా తరగతులు విజయవంతమయ్యాయని నియోజక వర్గ మండల, గ్రామ స్థాయిలో సైతం కార్యకర్తలకు శిక్షణ ఇచ్చేందుకు కార్యక్రమం రూపొందించడం జరిగిందని రెండు మాసాల్లో పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. పార్టీ కార్యక్రమాల నివేదికను జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పాల్గొన్నారు.

## కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ముజామిల్ ఖాన్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా నూతన కలెక్టర్‌గా ముజామిల్ ఖాన్ బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం పెద్దపల్లి కలెక్టర్‌గా పనిచేస్తున్న ముజామిల్ ఖాన్‌ను ఖమ్మం కలెక్టర్‌గా బదిలీ చేసింది. కలెక్టర్ ముజామిల్ ఖాన్ ఆదివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. తొలుత కలెక్టరేట్‌కు వచ్చిన కలెక్టర్ ముజామిల్ ఖాన్‌కు అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్, కలెక్టరేట్ ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ ఉద్యోగులు, ఇతర అధికారులతో కొద్దిసేపు ముచ్చటించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ముజామిల్ ఖాన్‌కు ఉద్యోగులు, సిబ్బంది, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఆలోచనలు

**(మొదటిపేజీ తరువాయి)**

మేధావులు, విద్యావంతులు అట్టడుగు వర్గాల ప్రజల గురించి ఆలోచించడమే గాక ప్రభుత్వాల తీరును ప్రశ్నించే వారని ప్రజలకు మద్దతుగా నిలిచే వారని ఆయన తెలిపారు. దురదృష్ట వ శాత్తు ప్రజలను తప్పుదారి పట్టించేందుకు, ప్రజలను భ్రమల్లోకి గురి చేసేందుకు కొందరు తమ మేధా సంపత్తిని ఉపయోగిస్తున్నారని ఇది సమాజానికి అత్యంత ప్రమాదకరమన్నారు. చైతన్య వంతమైన ఆలోచనలతో ప్రజల కోసం ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలి తప్ప పాలకుల ప్రాపకం కోసం తమ ఆలోచనలను అమ్ముకోరాదని యుగల్ రాయలు తెలిపారు. ప్రోగ్రెసివ్ ఫోరం ప్రజల సమస్యలను గుర్తించి ప్రజలను చైతన్యపరిచి పరిష్కారానికి ప్రోగ్రెసివ్ ఫోరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

**నూతన కమిటీ ఎన్నిక...**

ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం నూతన కమిటీని ఎన్ను కున్నారు. కమిటీ అధ్యక్షులుగా ప్రముఖ వైద్యులు వై. ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కె. శరత్ బాబు, ప్రధాన కార్యదర్శిగా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఉపేంద్రనాథ్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా కె. విష్ణుమూర్తి, కార్యవర్గ సభ్యులుగా కోసూరి ప్రసాద్, డాక్టర్ నారాయణ, వెంకటరమణ, అంకిత రవి, బెజ్జంకి ప్రభాకరాచారి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కరెంటుపై గ్రామ సభలు

**(మొదటిపేజీ తరువాయి)**

వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తారని ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో రికార్డు చేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ రంగ పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే శ్వేత పత్రం విడుదల చేసి శాసన సభలో చర్చకు పెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సభలో మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి లేచి విద్యుత్ కొనుగోలు విషయం పై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేసిన మేరకే న్యాయ విచారణకు ఆదేశించామని ఇందులో కక్ష సాధింపు ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు. ఇందిరా గాంధీ లాంటి వారే విచారణ కమిషన్ల ముందు హాజరయ్యారని హాజరు కాకపోతే న్యాయ వ్యవస్థ తన పని తాను చేస్తుందన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి అనుభవం కలిగిన వారని ఆయన గుర్తు చేస్తూ నేను చెప్పిందే వేదం శాసనమంటే న్యాయ వ్యవస్థపై నమ్మకం లేనట్లేనని భట్టి తెలిపారు. విచారణ కమిటీ నియమించడం వరకే ప్రభుత్వం పని అని అంతే కాని విచారణకు ఎవరిని పిలుస్తారు ఏమిటి అన్నది తమకు తెలియదన్నారు. పదేళ్ల నుంచి రెవెన్యూ శాఖ లో సమస్యల పరిష్కారానికి కృషి జరగ లేదని కొంత మంది పెద్దలకు మేలు చేసేందుకు ధరణిని తీసుకు వచ్చారన్నారు. పార్ట్ బిలో భూములు కాజేసేందుకు వెసులుబాటు కల్పించారని భట్టి తెలిపారు. ధరణి సమస్యలపై నిర్ణయం తీసుకుంటామని ఎన్నికలకు ముందే చెప్పామని ఆ తర్వాత కమిటీ వేశామని అందరి అభిప్రాయాలను ప్రజల ముందు ఉంచుతామన్నారు. రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# తలసేమియా చిన్నారులకు అండగా నిలుస్తాం

**-ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి**
**-సంకల్ప సంస్థ ఆధ్వర్యంలో మందుల పంపిణీ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు పోలీసులు అండగా నిలుస్తున్నారని వారికి తమ శాఖ ద్వారా అన్ని విధాలా సహాయ సహకారాలను అందిస్తామని ఖమ్మం నగర ఏసిపి ఎస్వి రమణమూర్తి తెలిపారు. ఆదివారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో రక్తదాతలు, రక్తదాన శిబిరాలను నిర్వహించే వారిని సన్మానించారు. చిన్నారులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఏసిపి రమణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మందులు పంపిణీ చేసి రక్తదాతలను సత్కరించారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ పోలీస్ శాఖ ద్వారా తలసేమియా చిన్నారులకు గతంలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశామని భవిష్యత్తులో కూడా వారికి రక్తం కొరత లేకుండా చూస్తామన్నారు. ఖమ్మం నగరంలో రక్తదాన శిబిర ఏర్పాటుకు తాము కృషి చేస్తామని తెలిపారు. రక్తదానం చేస్తున్న దాతలను అభినందించారు. చిన్నారుల ప్రాణాలను కాపాడడంలో దాతల సహాయం వెలకట్టలేనిదన్నారు. వందలాది మంది చిన్నారులకు రక్తం, మందులు కొరత లేకుండా అందిస్తున్న సంకల్ప స్వచ్ఛంద సంస్థ సేవలను ప్రతి ఒక్కరూ అభినందించాలన్నారు. తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టాటా) ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కన్నారపు ప్రసాద్ ఈనెల చిన్నారుల మందుల కోసం అసోసియేషన్ తరుపున సంకల్ప సంస్థకు రూ. 50వేల ఆర్థిక సాయం చేశారు.ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్తులో తలసేమియా చిన్నారుల సంరక్షణ కోసం సంకల్ప సంస్థకు మద్దతుగా నిలుస్తామని తెలిపారు. రక్తదాతలు బోస్ యాదవ్, కాంగ్రెస్ యువజన సంఘం నాయకులు జే. ఆంజనేయులు, జి. సతీష్, జి. నాగరాజు తదితరులను శాలువతో సత్కరించి మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నారాయణ మూర్తి, సంస్థ ఉపాధ్యక్షురాలు పి. పావని, పి. రవిచందర్, పి. అనిత, పి. ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మలను కలిసిన నూతన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ముజామిల్ ఖాన్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈసందర్భంగా కలెక్టర్ ముజామిల్ ఖాన్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మంజిల్లా అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి

**-50 మంది మైనర్ డ్రైవర్ల పట్టివేత**
**-ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మైనర్ డ్రైవింగ్ పై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారని ఖమ్మం ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఆదివారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 50 మంది మైనర్ డ్రైవర్లను పట్టుకున్నట్లు ఏసిపి తెలిపారు. వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణం చాలా మంది మద్యం తాగి వాహనాలు నడపడం ఒకటైతే మరొకటి మైనర్ డ్రైవింగులని తెలిపారు. కొద్ది రోజులుగా విద్యార్థులు, మైనర్లు బైకులు, కార్లు నడుపుతూ వరుసగా ప్రమాదాల బారీనపడుతున్నారన్నారు. గతంలో మైనర్ డ్రైవింగ్ చేస్తూ పోలీసులకు పట్టుబడితే జరిమానా వేసి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించడం జరిగిందని ఏసిపి తెలిపారు. ఇక నుంచి డ్రైవింగ్ చేస్తూ మైనర్లు పట్టుబడితే వాహనం సీజ్ చేసి వారితో పాటు వారి తల్లిదండ్రులను కూడా న్యాయ స్థానంలో హాజరు పర్చడం జరుగుతుందని తెలపారు. న్యాయస్థానం వారికి శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటికైనా తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించవద్దన్నారు. మైనర్ డ్రైవింగ్, రోడ్డు ట్రాఫిక్ నిబంధనల గురించి అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ క్లాసులలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. తద్వారా విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనల పై అవగాహన కలిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ మోహన్‌రావు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# గుట్కా విక్రయాలు చేస్తే కేసులు



**ప్రజాపక్షం/కల్లూరు:** నిషేధిత గుట్కా విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కల్లూరు ఎస్సై షేక్ షాకీర్ తెలిపారు. యువత ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతూ మత్తుకు బానిస అవుతున్న నిషేధిత గుట్కా అంబర్, ఖైనిలు విక్రయాలు చేస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దొరికితే ఎలాంటి వారినైనా వదిలేది లేదని పేర్కొన్నారు. నిషేధిత గుట్కాలు అమ్మే వారి సమాచారం అందిస్తే అట్టి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని వివరించారు.

# మానవత్వం చాటుకున్న ఎంపీపీ

**-అభినందించిన మండల ప్రజలు**



**ప్రజాపక్షం/కల్లూరు:** మానవత్వం చాటుకున్న కల్లూరు ఎంపీపీ రఘు ని కల్లూరు మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు అభినందించారు. వివరాలు ఇలా ఉన్నాయి... ఆదివారం ఉదయం కిష్టయ్య బంజరవెళ్లే రహదారి వద్ద శాంతినగర్ కు చెందిన మంద కృష్ణ ను వెనుక నుంచి కారు ఢీకొనడంతో ప్రమాదానికి గురయ్యారు. ఆ సమయంలో అక్కడే ఉన్న కల్లూరు ఎంపీపీ రఘు స్పందించి 108 అంబులెన్స్ లో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తక్షణం స్పందించి వైద్యం అందించేందుకు సహకరించిన కల్లూరు ఎంపీపీని కల్లూరు శాంతినగర్, మండల ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ధన్యవాదాలు తెలిపారు.

# ఉచితంగా కృత్రిమ పాదాలు పంపిణీ




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో 105 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాలు పంపిణీ చేశారు. ఆదివారం ఖమ్మం నగరం గట్టయ్య సెంటర్‌లోని రోటరీ క్లబ్ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్ లో జరిగిన కార్యక్రమంలో ఏకం యుఎస్ఏ సంస్థ ఆర్థిక సహాయంతో రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో 105 మందికి కృత్రిమ పాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వికాస తరంగిణి ఖమ్మంజిల్లా అధ్యక్షులు పోలా శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం ఖమ్మంజిల్లా అధ్యక్షులు గోళ్ల రాధాకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం చేపడుతున్న సేవలను కొనియాడారు. సంస్థ ద్వారా ఎంతో మందికి ఉచితంగా కృత్రిమ పాదాలను అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఈ సంస్థ ద్వారా మరింత మందికి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ మల్లాది వాసుదేవ్, సెక్రటరీ సాంబశివరావు, క్లబ్ అధ్యక్షులు ఎం. రవీంద్రనాథ్, సర్వీస్ కో ఆర్డినేటర్ పసుమర్తి రంగారావు, అసిస్టెంట్ గవర్నర్ పి. భూషణ్‌రావు, క్లబ్ సెక్రటరీ హరి శ్రీనివాస్, సభ్యులు మేకల భిక్షమయ్య, సుధాకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్అండ్‌బి స్థలంకు ఫెన్సింగ్



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ఆర్ అండ్ బి స్థలం కు ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో రూ. ఆరు లక్షలు నిధులతో ఇనుప ముండ్ల కంచెను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్ అండ్ బి ఈ ఈ సత్తుపల్లి ఎం. హేమలత తెలిపారు. గతంలో ఉన్న ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ను బస్టాండ్ కి కేటాయించడంతో పాత బస్టాండ్ స్థలాన్ని ఆర్ అండ్ బి శాఖ కు అప్పటి ప్రభుత్వంఅప్పగించారు. అట్టి స్థలం ఎలాంటి ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు స్థలాన్ని రక్షించుకునేందుకు ఇనుప ముళ్ళకంచెను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆదివారం వారు ఆ స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ త్వరలో ఈ స్థలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వానికి అధికారులకు ప్రజా ప్రతినిధులకు ప్రజలకు ఉపయోగపడే విశ్రాంతి భవనమును నిర్మించేందుకు నిధులు రాగానే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి మండల శాఖ అధికారి రవిచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమం



**ప్రజాపక్షం/పినపాక:** రేపు విద్యుత్ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా విద్యుత్ శాఖ ఏఈ కావ్య తెలియజేశారు. ఆదివారం ఆమె పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో గల విద్యుత్ శాఖ కార్యాలయంలో మాట్లాడారు. నార్తన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ అఫ్ తెలంగాణ లిమిటెడ్ సీఎండీ ఆదేశాల మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించే దిశగా ఈ బయ్యారం విద్యుత్ ఉప కేంద్రం సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కావున వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే సంప్రదించగలరని కోరారు.

# మిత్రుడికి వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలంలోని దేవర నాగరం గ్రామానికి చెందిన గోగ్గలి సాగర్ అనారోగ్యం తో బాధపడుతూ ఉండగా ఆదివారం అతని పదవ తరగతి స్నేహితులందరు కలసి హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం రూ. 12 వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో మిత్రులు ఈశం నరేష్, రామారావు, కిషోర్, బాబురావు, పూర్ణ, రాజేందర్ పాల్గొన్నారు.

## సాయిబాబా మందిరంలో అన్నదానం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** శ్రీ షిర్డీసాయిబాబా సప్తదశ వార్షికోత్సవ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని విజయ నగర్ కాలనీ రోడ్డు నెం.2లో ఉన్న శ్రీ షిర్డీసాయిబాబా మందిరం సప్తదశ (17)వ వార్షికోత్సవ సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక హారతులు, అభిషేకాలు నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని బాగం హేమంతరావు దంపతులు, పోట్ల వెంకటేశ్వరరావు దంపతులు, ఇంటూరి తులసమ్మ లు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు ఫణిభట్ల రాజలింగయ్య, బుద్ధ రామకృష్ణ, పెంట్యాల వెంకటనర్సయ్య, చంద్ర వీరభద్రరావు, కౌలూరి అప్పారవు, మన్నెపూడి కృష్ణయ్య, దొడ్డా నర్సింహారావు, భూక్యా భిక్షపతి, కార్పొరేటర్ రోహిణి సత్యనారాయణ, మచ్చా నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించండి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ తనూజ అన్నారు. ఆదివారం డ్రైడే సందర్భంగా స్థానిక కస్తూర్బా పాఠశాల ఎస్సీ ఎస్టీ బీసీ హాస్టల్లో దోమల మందు పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలను నివారించితే వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. ఇంటి చుట్టు పక్కల నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. డెంగ్యూ, మలేరియా జ్వరాలు రాకుండా ముందస్తుగా దోమల మందు పలు హాస్టల్లో పిచికారి చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో యూనిట్ ఆఫీసర్ కుమార్ స్వామి, సూపర్వైజర్ ఇమామ్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాలకుర్తి ప్రసాద్ దశదిన కర్మలో పాల్గొన్న మాజీ ఎంఎల్ఏ తాటి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని పొగలపల్లి గ్రామంలో తెలంగాణ ఉద్యమకారులు టిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు పాలకుర్తి ప్రసాద్ దశ దిన కర్మలో మాజీ ఎంఎల్ఏ తాటి వెంకటేశ్వర్లు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ బైటి రాజేష్, పాలకుర్తి రత్నభూషణం, కుమ్మరాజు శ్రీను, కందుకూరి రాంబాబు, శేఖర్‌బాబు, పాలకుర్తి రవి, సుమిత్, కొట్టె శంకర్, పాల్గొన్నారు.

## ఘనంగా మెచ్చా జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మాజీ ఎంఎల్ఏ మెచ్చా నాగేశ్వరరావు పుట్టిన రోజు వేడుకలను బిఆర్ఎస్ మండల అధ్యక్షులు దారా బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం చంద్రుగొండలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎంఎల్ఏ మెచ్చా నాగేశ్వరరావు నియోజకవర్గం అభివృద్ధి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసి తీరుతామని ఇప్పటి వరకు పూర్తిగా చేయకుండా విఫలమయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సొసైటీ వైస్ ఛైర్మన్ వెంకట్ నారాయణ, డైరెక్టర్ ఉన్నం నాగరాజు, సత్తి నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, చిన్న పిచ్చయ్య, కళ్లెం వెంకటేశ్వర్లు, జానకి రాములు, బాలు, శ్రీనివాస్ నాయక్, పాల్గొన్నారు.

## 18న ఇసుక వేలం

**ప్రజాపక్షం/గుండాల :** ఇటీవల మండల పరిదిలోని ముత్తాపురం పరిదిలో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నిలువ ఉంచిన ఇసుకను గుండాల తహసీల్దారు ఇమానియల్ 450 క్యూబిక్ మీటర్ల ఇసుకను స్వాదీనం చేసుకొని సీజ్ చేయబడిన ఇసుకను ఈ నెల 18న మండల తహసీల్దారు కార్యాలయంలో అట్టి ఇసుకను వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. పాటలో పాల్గొన దలిచిన వారు ముందుగా 500రు. కార్యాలయంలో చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డు ద్వారా విన్నపాలు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నియోజక వర్గంలోని రఘునాథపాలెం గ్రామంలో సాధిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధరణిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ను మార్చాలని కోరుతూ ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోస్టు కార్డు ద్వారా విన్నపాలు పంపారు. ఈ సందర్భంగా సాధిక్ ఫౌండేషన్ ఛైర్మన్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ధరణి విషయంలో అనేక అవకతవకలు జరిగాయని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి, సిసిఎల్ఏ కమిషనర్‌గా పనిచేస్తున్న నవీన్ మిట్టల్ ఇంకా అదే పదవిలో కొనసాగడం జరుగుతుందని వెంటనే అతన్ని మార్చాలని కోరారు. ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించి నవీన్ మిట్టల్‌ను మార్చాలని బాధితుల తరుపున కోరారు.ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారులు షేక్ అబ్దుల్ రెహ్మాన్, విజయ్‌కుమార్, భద్రునాయక్, అడ్వకేట్ షేక్ నజమా, డాక్టర్ ఖిజారుల్లా, బి. ఉపేంద్ర, జయ, గోవిందమ్మ, నాగేశ్వర్, ఖైజర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బడులు మూతబడేనా.. తెరుచుకునేనా..?



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల దెబ్బకు మండలంలో ప్రభుత్వ పాఠశాలు అయిన ఓబుల రావు బంజర, రామకృష్ణాపురం, దారుక బంజర, వడ్డెర కాలనీ, చిన్న కోరుకొండి మాలపల్లి తదితర పాఠశాలలు గత ఐదు సంవత్సరాల క్రితం మూతబడి ఉన్నాయి. దీంతో రేవంత్ రెడ్డి రాకతో ప్రతి పంచాయతీలో ఒక పాఠశాల తప్పనిసరిగా పనిచేయాలని నిబంధనతో ఈ విద్యా సంవత్సరం జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమంలో భాగంగా మూతబడిన పాఠశాలలు నడిపించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలతో ఉపాధ్యాయులు వారు ఆయా గ్రామాలలో విద్యార్థులు తల్లిదండ్రులు ప్రముఖులు గ్రామస్తులతో ఇంటింటికి వెళ్లి విద్యార్థులు తల్లిదండ్రులను కలిసి అవగాహన కల్పిస్తున్నారు. ఈ విషయమై ఆ బడులు నడిచేనా..? మూతపడేనా..? అనేసందిగ్ధం లో ఉన్నారు.

## ఘనంగా గ్రామదేవతల వార్షికోత్సవం



**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ మండలంలోని రాఘవాపురం గ్రామం లో 2023 సంవత్సరం లో బొడ్రాయి ప్రతిష్ఠ, అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభం, మహాలక్ష్మమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం, ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ఠలు జరిగి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆదివారం వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలో గల మహిళలు బొడ్రాయికి ఆంజనేయ స్వామి, అంకమ్మ తల్లి, మహాలక్ష్మి, ముత్యాలమ్మకు బిందెలతో నీళ్లు పోసి జలాభిషేకం చేశారు. అనంతరం హోమాలు, పూజా కార్యక్రమాలు, అమ్మవార్లకు బోనాల కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం రోజు ఉదయం 8 గంటలకు అంకమ్మ తల్లి దేవాలయం దగ్గర హోమం పూజా కార్యక్రమాలు తర్వాత మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నదాన కార్యక్రమం ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు.

## మాదిగల ఆత్మగౌరవ కవాతు ర్యాలీని జయప్రదం చేయండి

**- ఎంఆర్‌పిఎస్ పాలేరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఆనందరావు**



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** జులై 7వ తేదీన వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ కవాతుర్యాలీకి పెద్ద ఎత్తున్న మాదిగలు తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ పాలేరునియోజకవర్గం పోరాటసమితి ఇన్చార్జి వంగూరి ఆనందరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలంలోని మారెమ్మగుడిపరిధిలో పార్టీ మండల కమిటీల అత్యవసర సమీక్ష సమావేశంను కనకం జనార్ధన్‌మాదిగా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాదిగ మాట్లాడుతూ...గత మూడు దశాబ్దాల కాలంలో ఎమ్మార్పీఎస్ ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో అలుపెరగని పోరాటాలు చేస్తుందన్నారు. ఆ పోరాటం ప్రధాని నరేంద్రమోడీ చొరవతో ఒక కొలిక్కి రావటం జరిగిందన్నారు. ఫిబ్రవరి 6,7,8 తేదీల్లో సుప్రీంకోర్టులో జరిగిన వాదోపవాదాలతో జడ్జిమెంట్‌ను రిజర్వ్ చేసిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. అలాంటి కీలకమైన జడ్జిమెంట్ జులై 7తర్వాత ఒక స్పష్టమైన వైఖరితో తీర్పు వెలువడునుందన్నారు. ఈ నేపథ్యంలోనే ఆత్మగౌర పోరాటం చేపట్టడం జరిగిందని, మాదిగలు, దాని ఉపకులాలు విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా మండల సీనియర్ నాయకులు బోయిన కృష్ణమాదిగ, చెరుకుపల్లి రాంబాబుమాదిగ, చెరుకుపల్లి భాస్కర్‌మాదిగ, గుగ్గిళ్ల ప్రభాకర్‌మాదిగ, కృష్ణమాదిగ, బత్తిని ఆనందరావుమాదిగ, రాంబాబుమాదిగ, పొన్నెకంటి అఖిల్‌మాదిగ, సత్తయ్యమాదిగ, కిషోర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపి రవిచంద్రకు ఆహ్వానం



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ (బైపాస్‌రోడ్) :** ఖమ్మం నగరంలోని టీఎన్జీఓస్ ఫంక్షన్‌హాల్‌లో జులై 6,7 తేదీలలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు రాజ్యసభ సభ్యుడు(ఎంపీ) గాయత్రి రవి చంద్రకు ఆహ్వానం లభించింది. తెలంగాణ పవర్‌లిఫ్టింగ్ జాయింట్ సెక్రటరీ సిహెచ్ మనోజ్‌కుమార్ హైదరాబాదులో ఉన్న ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రికను అందజేసి హాజరు కావలసిందిగా కోరారు. కార్యక్రమంలో ఖమ్మం డిస్టిక్ పవర్ లిఫ్టింగ్ కోశాధికారి జె.సతీష్, ప్రముఖ వ్యాపారవేత్త రాపర్తి రాజా, బిల్డర్ కార్తీక్ ఉన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న కలెక్టర్ జితేష్ వి పటేల్





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** విధుల్లో చేరిన మొదటి రోజునే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పటేల్ మానత్వాన్ని చాటుకున్నారు. అపదలో ఉన్నవారికి కొండత అండగా నేనున్నాననే ధైర్యం చెప్పారు. ఈవిషయంపై వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని సారపాక క్రాస్ రోడ్డు వద్ద ఆటో, ద్విచక్ర వాహనం ఆదివారం ఢీ కొన్నాయి. అటుగా వెళ్తున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి పటేల్ కారును ఆపి, ప్రమాదంలో గాయపడిన వారికి స్వయంగా తన కారులో ఎక్కించుకొని, మరి కొందరిన్ని 108 అంబులెన్స్ ద్వారా భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. విధుల్లో చేరిన మొదటి రోజునే తమ మానవత్వాన్ని చాటుకున్న జిల్లా కలెక్టర్‌ను జిల్లా ప్రజలు అభినందిస్తున్నారు. అపదలో ఉన్నవారికి అండగా నిలబడే తత్వం కలిగిన కలెక్టర్ జిల్లాకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ప్రమాదం ఏ విధంగా జరిగింది అనే విషయంపై బూర్గంపాడు పోలీసులకు ఫోన్ చేయగా అందుబాటులో రాలేదు.

## మల్లికార్జున స్వామి గంగమ్మ దేవాలయానికి మంచినీటి ట్యాంకు నిర్మాణానికి సహకరించిన అప్పారావు





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** జన్మనిచ్చిన తల్లిదండ్రులను పుట్టిన ఊరుని విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలను మర్చిపోకుండా భారత ప్రభుత్వ విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేస్తూ భారత ప్రభుత్వ భద్రత నిర్వాహంలో విధులు నిర్వహిస్తూ స్వగ్రామమైన పిండిప్రోలు గ్రామంలో మల్లికార్జున స్వామి గంగమ్మ దేవత దేవాలయ పునర్నిర్మాణానికి సహకారం చేస్తూ యాదవ సంఘం భక్తుల సౌకర్యార్థం సుమారు 65 వేల రూపాయల ఖర్చుతో మంచి నీటి సౌకర్యాన్ని అందించిన దంపతులు జక్కుల అప్పారావు సతీమణి అనూష జక్కుల సురేష్ సతీమణి ప్రత్యూష వారి తండ్రి జక్కుల పెద్ద మాన్సింగ్ జ్ఞాపకార్థం పేరు మీద మంచినీటి ట్యాంకు నిర్మాణాన్ని సుమారు 65 వేల రూపాయలు ఖర్చు చేసి మంచినీటి ట్యాంకును నిర్మించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లికార్జున స్వామి గంగమ్మ దేవాలయానికి పునర్నిర్మాణానికి సహకారం అందించిన ప్రజలకు పిండిప్రోలు యాదవ సంఘం ప్రజలకు ధన్యవాదాలు అని గుడి నిర్మాణానికి సహకరించాలని గుడి నిర్మాణం కోసం ఏ ఒక్క రూపాయి దాతలు ద్వారా సేకరించిన అది గుడి నిర్మాణానికి ఖర్చు చేయాలని వారు కోరారు. మల్లికార్జున స్వామి గంగమ్మ దేవతామూర్తులు ఆశీస్సులతో యాదవ సంఘం యాదవ సంఘం ప్రజలు సుఖశాంతులతో సిరి సంపదలతో ఆయురారోగ్యాలతో పాడిపంటలతో తులతూగాలని యాదవ సంఘం అభివృద్ధి కోరుకునే వారిలో జక్కుల అప్పారావు కుటుంబ సభ్యులు ఎల్లవేళలా తోడ్పాటు అందిస్తామని వారు తెలిపారు.

## ఇచ్చిన హామీలను అమలు చేసి తీరుతాం

**-ఎంఎల్ఏ జారే ఆదినారాయణ**



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మాట తప్పకుండా అమలు చేసి తీరుతుందని అశ్వారావుపేట నియోజకవర్గ ఎంఎల్ఏ జారే ఆదినారాయణ అన్నారు. ఆదివారం చంద్రుగొండ పోలీస్ స్టేషన్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీలో ఐదు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. గత పార్లమెంట్ అదే విధంగా ఎంఎల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించిన కార్యకర్తలకు నాయకులను అభినందించారు. ఎన్నిలక ముందు ఈ మండలం నుండే ప్రస్థానం మొదలు పెట్టానన్నారు. పల్లె నిద్ర హాలో శుభోదయం కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు పార్టీ కార్యాలయం వేదికగా ఉండాలన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిపి బానోత్ పార్వతి, ఎంపిటిసి లంక విజయలక్ష్మి , ఆ పార్టీ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్యానాయక్, తుమ్మలపల్లి సురేష్, ఉప్పతల ఏడుకొండలు, కొదుమూరి దయాకర్‌రావు, గోవిందరెడ్డి, కేశబోయిన నరసింహారావు, చంద్రు విజయ్, సంక శంకర్, బుంగ శ్రీను, రామారావు, మనోహర్, రామ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

## బత్తిన సుగుణ దశ దిన కర్మలకు హాజరైన ఎంఎల్ఏ జారే



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సారపాక నివాసి గతంలో సారపాక గ్రామ పంచాయితీ కార్యదర్శిగా విధులు నిర్వహించి, ప్రస్తుతం ఆళ్లపల్లి ఎంపివోగా విధులను నిర్వహిస్తున్న బత్తిన శ్రీనివాసరావు తల్లి బత్తిన సుగుణ దశ దిన కార్యక్రమంలో అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ, మాజీ ఎంఎల్ఏ తాటి వెంకటేశ్వర్లులు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అనే నానుడిని బత్తిని సుగుణ పాటించిందని తన మరణాంతరం తన అవయవాలు ఎవరికైన అవసరమైతే ఆ అవయవాలు దానం చేయమని కుటుంబ సభ్యులకు చెప్పడం, తన మరణాంతరం తన నేత్రాలను దానం చేయడం ద్వారా ఎప్పటికీ సుగుణ జీవించే ఉంటుందని, నేటి యువతకు సుగుణ ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఈకార్యక్రమంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ నాయకులు, గెజిటెడ్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు బెల్లంకొండ వాసుదేవరావు, రామారావు, ప్రసాద్, ఐటిసి సీనియర్ యూనియన్ నాయకులు గోనె దారుగ, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, కొనకంచి శ్రీను, బాలి శ్రీహరి, ఐటిసి ఐఎన్‌టీయూసి అధ్యక్షులు గోనె రామారావు, ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి, ఐటిసి యూనియన్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, బిఆర్ఎస్ నాయకులు, టిఎన్‌టియూసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన నూతన కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా నూతన కలెక్టర్‌గా జితేష్ వి పాటిల్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో పాటు పలువురు పుష్పగుచ్చాలను అందించి కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఛాంబర్‌లో జిల్లా అధికారులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడె ం జిల్లాలో పనిచేసే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాల మేరకు అందరినీ సమన్వయం చేస్తూ సేవలందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రామాలయాన్ని దర్శించుకున్న కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. గర్భగుడిలోని స్వామికి గోత్ర నామాలతో పూజలు చేసిన ఆయన ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ తాయారమ్మ, శ్రీ అభయాంజనేయ స్వామి వార్లకు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం విశిష్టతను అర్చకులు ఆయన వివరించడంతో పాటు షాలువాతో సత్కరించి మమెంటో అందజేశారు.

## సిబ్బంది సహకారం మరువలేనిది



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఏడాది కాలం పాటు గిరిజనులకు మేలే చేసే విషయంలో సిబ్బంది తనకు అందించిన సహకారం ఎన్నటికీ మరువలేనిదని ఐటిడిఏ పిఓగా విధులు నిర్వహించి వికారాబాద్ కలెక్టర్‌గా బదిలీపై వెళుతున్న ప్రతీక్ జైన్ అన్నారు. ఈ సందర్భంగా ఐటిడిఏ సిబ్బంది ఆయనను సత్కరించుకుని ఆయనతో ఏడాది కాలం చేసిన ప్రయాణాన్ని నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనాభివృద్ధికి సంబంధించి ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి మేలు చేసే కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. గిరిజనులు దినదినాభివృద్ధి చెందుతూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ డిడి మణెమ్మ, ఏపిఓ డేవిడ్ రాజుతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యులను పరామర్శించి ఎంఎల్ఏ జారే



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని పొగళ్లపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు పాలకుర్తి ప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. కాగా ఆదివారం మృతుడి దశ దిన కర్మలకు ఎంఎల్ఏ జారే ఆదినారాయణ హాజరై, మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించిన భక్తులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలం తొడతెలగూడెం గ్రామంలో యాదవ మహిళలు గ్రామ పెద్దలు, యువత, పిల్లలందరూ మేళతాళాలతో డిజె సౌండ్స్‌తో ఆనందంతో గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించారు.అలాగే గొర్రెలు, కోళ్లు అమ్మవారికి సమర్పించారు. వర్షాలు చల్లగా పడాలని పంటలు బాగా పండాలని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే అమ్మవారికి నూతన రేకులతో అమ్మవారి గుడిని యాదవులు నిర్మించారు.

# గుట్కాపై నిషేధం ఎక్కడ..?



**-ప్యాకెట్ చిన్నది...రోగం పెద్దది**
**-గుట్కా అమ్మకాలకు అడ్డుకట్టేది?**
**-అధికారులు పర్యవేక్షణ ఎక్కడ?**
**-ప్రభుత్వ నిషేధం అమలు ఎక్కడ?**








**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లాలో గుట్కా అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. గుట్కా పాన్ మసాలాలను తెలంగాణ రాష్ట్రంలో నిషేధించినప్పటికి గుట్కా వ్యాపారం మాత్రం మూడు పువ్వులు ఆరు కాయలుగా జరుగుతుంది. గుట్కా పాన్ మసాల తినడం వలన ఆరోగ్యం దెబ్బతింటుంది అని తెలిసినా వాటికి బానిసలైన వారు ప్రతిరోజు తింటూనే ఉన్నారు. గుట్కా అలవాటు చేసుకున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుంది. దీనిని ఆసరాగా చేసుకున్న గుట్కా వ్యాపారులు సైతం గుట్కా కొరత ఉందని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గుట్కాకు బానిస అయిన వారు ధర పెచిన కొనుగోలు చేసి తింటున్నారు. జిల్లాలో పోలీసులు గుట్కా అక్రమ రవాణా గుట్కా పాన్ మసాలాలు విక్రయాలపై నిఘా పెట్టడం లేదు. ఆరోపణలు లేక పోలేదు. గుట్కాలు, పాన్ మసాలాలు, రాజీఖైనీ నిషేధితమని యధేచ్ఛగానే విక్రయిస్తున్నారు. పల్లె పట్టణం అనే తేడా లేకుండా అమ్మకాలు జరుగుతున్నాయి. దీంతో పల్లెలో యువత మధ్య వయస్సుల వారు గుట్కా పాన్ మసాలాల మత్తుకు బానిసలై రోజుకు 15, 25 ప్యాకెట్లు నములుతూ వారి ఆరోగ్యం పాడుచేసుకుంటున్నారు. హోల్‌సేల్ డీలర్ల నుండి ప్రివిజన్ స్టోర్‌లు కొనుగోలు చేస్తారు. అక్కడి నుండి మండల కేంద్రాలకు, పంచాయతీలకు సరుకును యధేచ్ఛగా కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు గుట్కా పాన్ మసాలాల విక్రయాలపై నిషేధం ఉందో లేదో తెలియటం లేదు. నిషేధమనే మాటే గుర్తుకు రాకపోవడం గమనార్హం. కొంతమంది యువకులు గుట్కా పాన్ మసాలాలకు బానిసలై క్యాన్సర్ బారిన పడి మృత్యువాత పడ్డారు. మరికొంత మందికి దంతాలు ఊడిపోవడం వంటిని జరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఏది ఏమైనా గుట్కా, పాన్ మసాలాలను పూర్తిస్థాయిలో కట్టడి చేస్తేనే జిల్లాలో కొంతవరకైనా యువత, మధ్య వయస్సు వారిని వాటి బారి నుండి కాపాడుకోవచ్చు.

**ఆఫీస్‌కి పరిమితమైన అధికారులు...**

జిల్లాలో పెద్ద ఎత్తున గుట్కా స్టాక్ ఉందని ఆరోపణలు లేక పోలేదు. పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లాలోకి గుట్కా సరఫరా జరుగుతుందని వినిపిసుతంది. ప్రతి మండలంలో పెద్ద ఎత్తున గుట్కా విక్రయాలు సాగుతున్నాయి. గుట్కా తిన్నవారు క్యాన్సర్ బారిన పడుతున్నారు. నిషేధిక గుట్కా వ్యాపారం జోరుగా సాగుతుంది. రాష్ట్రంలో గుట్కా నిషేధం విధించారు. కాని అధికారులు ఆ నిషేధం అమలు చేయడం లేదు. నిషేధం పట్ల ప్రభుత్వం ఆదేశాలు ఉన్న గ్రామాల్లో పట్టణాల్లో చిన్న పెద్ద దుకాణాలు పాన్ షాపుల్లో దర్జాగా గుట్కా విక్రయాలు సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గుట్కా విక్రయాలపై నిషేధం విధించినా ఇక్కడున్న అధికారుల నిర్లక్ష్యం వలన ఇతర జిల్లాల నుండి గుట్కా ప్యాకెట్లు తెచ్చి విక్రయిస్తున్నారు. తెలంగాణలో గుట్కా ప్యాకెట్లు నిషేధం ఉన్నప్పటికి ఖమ్మం జిల్లాలో వైరా ,తల్లాడ, మధిర, సత్తుపల్లి,అశ్వారావుపేట తదితర మండలాల్లో దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో నిషేధం దృష్టిలో ఉంచుకొని దళారులు ఎక్కడి నుండో తెచ్చి ఇక్కడ అమ్మడంపై అధికారులు జోక్యం చేసుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు. గుట్కా వలన యువత జీవితం నాశనం అవుతుందని తెలుపుతున్నారు.

**పట్టణాల నుంచి పల్లె గ్రామాల వరకు గుట్కా దందా జోరుగా....**

పట్టణాలనుండి పల్లెలకు జోరుగా గుట్కా సరఫరా జరుగుతుంది. మోటార్‌సైకిల్, టివిఎస్, ఆటోలు రకరకాల వాహనాల్లో సరఫరా జరుగుతుంది అనే ఆరోపణలు లేక పోలేదు. గుట్కా రవాణాపై దాడులుచేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారుల ఎక్కడ కనపడటం లేదు. ఆఫీస్‌కు పరిమితమయ్యారని విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో గుట్కా పాన్ మసాలాల వ్యాపారాలు యధేచ్ఛగా జరుగుతున్నాయి. వాటిని కట్టడి చేయాల్సిన అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నారు. పెద్ద పెద్ద కిరాణా షాపుల్లో కూడా గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నారు. ఈ గుట్కా వ్యవస్థను నిషేధించాలంటే నిఘా వ్యవస్థ పటిష్టం చేసి ఇతర జిల్లాల నుండి గుట్కాను తరలిస్తున్న దళారులను కఠినంగా శిక్షించాలనే డిమాండ్ ఎక్కువగా వినిపిస్తుంది. అప్పుడు కొంతవరకైనా గుట్కాను నిర్మూలించవచ్చని పలువురు ప్రజలు అంటున్నారు. గుట్కా మాఫియాపై కట్టడికి ప్రత్యేక అధికారులను నియమించి గుట్కా ప్యాకెట్ ఎక్కడి నుండి వస్తుంది. ఎక్కడకు చేరుతుంది. ఎవరి ద్వారా గ్రామాల్లో చేరుతుందనే దానిపై నిఘా ఏర్పాటు చేస్తే అసలు విషయాలు బయటికి వస్తాయి.

# గ్రామీణ వైద్యులపై దాడులను నిలిపివేయాలని డిప్యూటీ సిఎంకు వినతి



**ప్రజాపక్షం/బోనకల్ :** గత కొన్ని రోజులుగా జిల్లాలో గ్రామీణవైద్యులపై టిఎస్ఎంసి చేస్తున్న దాడులను నిలిపివేయాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టీవిక్రమార్కను తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమం సంఘం నాయకులు కోరారు. మండలంలోని తూటికుంట్ల గ్రామంలో పలు అభివృద్ధి పనులలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎంపిడబ్ల్యుఏ టిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోయినపల్లి శ్రీనివాసరావు, బొమ్మినేని కొండలరావు లు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో, తండాలల్లో అత్యవసర సమయాల్లో గ్రామీణ వైద్యులుగా ప్రథమ చికిత్స అందిస్తున్నామన్నారు. ఎన్నో యేండ్లుగా గ్రామీణ వైద్యులుగా పనిచేస్తు నేడు ఒక్కసారిగా వైద్యసేవలు నిలిపివేయాలని టిఎస్ఎంసి హెచ్చరిస్తుండడం బాధకరమన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఎర్పాటు అయితే ఆర్ఎంపి, పిఎంపిలకు శిక్షణ ఇచ్చి, గుర్తింపు ఇస్తామని మానిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించడం జరిగిందని గుర్తుచేశారు. ప్రభుత్వం రక్షణ కల్పించి గ్రామీణ వైద్యులను ఆదుకోవాలని, జరుగుతున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని వేడుకున్నారన్నారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ సిఎం మల్లు భట్టీవిక్రమార్కకు అందజేసిన వారిలో మండల అధ్యక్ష, కార్యదర్శులు యంగల గౌతమ్, బాలు, జిల్లా నాయకులు జెడిమూర్తి, గోపి, శ్రీనివాసరావు, హుసేన్, మరీదు కిషోర్, నాగేశ్వరరావు, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరు ప్రజల దాహార్తిని తీర్చిన మంత్రి





**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** తాగునీటి ఎద్దడిని నివారించాలని, తమ తాగునీటి సమస్య ను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరటంతో...స్పందించిన రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిధులు మంజూరు చేసి దాహార్తిని తీర్చారు. మండలం లోని కొత్తకొత్తూరు గ్రామంలో ఇటీవల పర్యటన కు వచ్చిన మంత్రి శ్రీనివాసరెడ్డి దృష్టికి తాగునీటి సమస్య ను మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, మాజీ ఎంపీటీసీ వెన్నపూసల సీతారాములు లు వివరించారు. ప్రజల ఇబ్బంది పడుతున్నారని వివరించారు. స్పందించిన వెంటనే రూ.3.60 లక్షల నిధులు ను మంజూరు చేశారు. ఈ మేరకు గ్రామంలో బోరు ను ఏర్పాటు చేసి, పైపు లైన్ ను పనులను అదివారం పూర్తి చేశారు. రెండు రోజులో తాగునీటి ఇబ్బంది లేకుండా ఉంటుందని మాజీ సర్పంచ్ రాధాకృష్ణ తెలిపారు. తాగునీటి సమస్య తెలియజేయగానే స్పందించిన మంత్రి శ్రీనివాసరెడ్డి కి గ్రామస్తులు రుణపడి ఉంటామని పేర్కోన్నారు.

# వర్షాలు కురవాలని రైతులు మొక్కులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఎర్రబోడు గ్రామంలో పురాతన మైసమ్మ తల్లి రైతులకు వర్షాలు కురవాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమలో మాజీ సర్పంచ్ కుర్సం సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి వజ్జరామారావు, గ్రామ పెద్దలు పూణెం బాబు, నాగేశ్వరరావు, కురసం బిక్షం, శ్రీను, భద్రయ్య , శేఖర్, నాగేంద్ర, రాగోలు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# క్రమం తప్పని వైద్యసేవలు చారిత్రాత్మకం

**ప్రజాపక్షం/వైరా:** బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో 108 నెలల నుంచి క్రమం తప్పని వైద్యసేవలు అందించడం చారిత్రాత్మకమైన కృషి అని వైరా ప్రముఖులు చింతనిప్పు వెంకటయ్య అన్నారు. ప్రతి నెల మూడో ఆదివారం వైరా సిపిఎం కార్యాలయంలో బోడేపూడి కళానిలయం వైద్యశిబిరం గత 108 నెలల నుంచి క్రమం తప్పకుండా నిరంతరంగా నిర్వహించడం జరుగుతుంది. ఆదివారం ఖమ్మం ప్రముఖ వైద్యులు చీకటి భారవి, పిల్లలు మర్రి సుబ్బారావు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా వైరా ప్రముఖులు చితనిప్పు (నాగార్జున) వెంకటయ్య, బోడేపూడి కళానిలయం సంస్థ కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ ఆధునిక యుగంలో ప్రజలు అనేక రకాల వ్యాధులకు గురవుతున్నారు అని క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆహార అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. డాక్టర్లు బృందం క్రమం తప్పకుండా వైద్యశిబిరానికి హాజరు కావడం వలన బోడేపూడి వైద్యశిబిరంలో రెండు రాష్ట్రాల నుంచి ప్రజలు సేవలు పొందడం జరుగుతుందని అన్నారు. విద్య వైద్య రంగాల్లో సమూల మార్పులు రావాలని అన్నారు. వైద్యం భరించలేని ఖరీదు కావడంతో ప్రజలు సకాలంలో వైద్యం పొందలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాపినేని రమేష్, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, మాజీ ఎంపిపి బొంతు సమత, గుడిమెట్ల రజిత, మాదినేని రజిని, గుడిమెట్ల మోహన్‌రావు, అనుమోలు రామారావు, పాసంగులపాటి చలపతిరావు, కంభంపాటి సత్యనారాయణ, అయిలూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



# వైరా నియోజకవర్గ ప్రజలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** బక్రీద్ పండుగను పురస్కరించుకొని వైరా నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను వైరా నియోజకవర్గ ముస్లీం సోదరీసోదరులు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ పవిత్రమైన త్యాగం రోజున విబేధాలతో తొలగి వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ బక్రీద్ పర్వదినం రోజున కరుణ, సోదర భావం సాత్యాగం పెంపొందిస్తుందని అన్నారు. ముస్లీంల ఆరాధ్యదైవం అల్లా యొక్క ప్రేమ ఆశీర్వాదాలు అందరిపై ఉండి అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలలని కోరుకున్నారు.

# కానరాని చినుకు జాడ..!

## -వానకాలం ప్రారంభమైన కరుణించని వరుణుడు
## -మృగశిర కార్తెలోనూ మండుతున్న ఎండలు


నిర్మానుష్యంగా ఉన్న నేలకొండపల్లి


బైరవునిపల్లిలో మొలకెత్తని విత్తనాలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** వానకాలం ప్రారంభమై వారం రోజులు దాటింది. అయినా పాలేరు నియోజకవర్గం లో సాధారణ వర్షపాతం కూడ నమోదు కాలేదు. కానీ పలువురు రైతులు పత్తి విత్తనాలు విత్తుకున్నారు. ఒక్క గట్టి వర్షం కూడ ఇప్పటి వరకు కురవలేదు. ఇప్పటికే రైతులు వేసవి దుక్కులు దున్నుకోగా మొదటి కురిసిన చిరు జల్లులకు మొదట విత్తనాలు కొంత మేర మెలకెత్తాయి.అయితే మృగశిర కార్తె లోనూ ఎండలు మండుతున్నాయి. పాలేరు నియోజకవర్గంలో రైతులు వ్యవసాయ సీజన్ పనులు ప్రారంభించారు. చాలా వరకు రైతులు పత్తి విత్తనాలు కూడ విత్తారు.వానకాలం నైరుతి రుతుపవనాలు ఆయువు పట్టు లాంటివి. ఈ సమయంలో కురిసే వానలతో రైతులు మెట్ట పంటలు సాగు చేయటంతో పాటు , వరి పంటలకు కావాల్సిన నీరు చెరువులు , కుంటలకు చేరితే రైతులకు ప్రయోజనం ఉంటుంది. కానీ నేటి వరకు ఏ ఒక్క చెరువు లో చుక్కనీరు కనిపించటం లేదు. గత ఏడాది మృగశిర కార్తె లనే వర్షాలు సమృద్ధిగా కురిసే రైతాంగం సంతోషంగా పంటలు సాగు చేసుకున్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందు వస్తాయని సంవృద్ధిగా వర్షాలు కురుస్తాయని వాతావరణం శాఖ చెప్పటంతో రైతాంగం పత్తి విత్తనాలను విత్తుకున్నారు. ముందస్తుగా విత్తుకున్నవి ఇప్పటికే మెలకెత్తటంతో వర్షాలు కురవకపోవటంతో అవి మెలకదశలో చనిపోఇయ పెద్ద ఎత్తున చూసే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కురవకపోతే విత్తనాలు విత్తుకోవటంలో ఆలస్యం అవుతుందేమోనని మరి కొందరు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**మృగశిర కార్తె లోనూ ఎండలే...**

మృగశిర కార్తె ప్రారంభమై వారం దాటిన వర్షాలు కురవక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా నైరుతి రుతుపవనాలు ప్రవేశించి వానలు కురిస్తే విత్తనాలు విత్తుకున్న వారికి మేలు జరుగుతుంది. మబ్బులు పట్టినప్పుడుల్లా రైతాంగం ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. వరుణు దేవుడు కోసం వర్షాలు కురవాలని వేడుకుంటున్నారు.

**వరుణదేవా...కరుణించవా....**

పాలేరు నియోజకవర్గంలో తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండలాలలోని వేలాది ఎకరాలలో పత్తి విత్తనాలు ఇప్పటికే నాటారు. మరి కొంత మంది విత్తనాలు విత్తుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ నేటి వరకు చినుకు జాడ లేకపోవటంతో ఏం చేయాలో అర్ధం కాక ఆందోళన చెందుతున్నారు. డివిజన్ వ్యాప్తంగా రైతాంగం పత్తి విత్తనాలు నాటిని వాటిలో సగం వరకు కూడ మెలకెత్తలేదంటే అశ్చర్యం కలగకమానదు. గ్రామాలలో కొంత మంది పొలాల వద్దకు వెళ్లి మబ్బులు వంక చూస్తు వరుణదేవా, కరుణించవా అంటూ వేడుకుంటున్నారు. పాలేరు నియోజకవర్గంలో బోడ్రాయిలకు, దేవాలయాలలో వానల కోసం ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

**సగం విత్తనాలు చచ్చిపోయాయి :**
**తేజావత్ వీరయ్య, శంకరగిరితండా, రైతు.**



గ్రామంలో నాలుగు ఎకరాలలో పత్తి విత్తనాలు నాటా...కానీ అందులో సగం కూడ విత్తనాలు కూడ మెలకెత్తలేదు. ఏం చేయాలో అర్ధం కావటం లేదు. చివరకు డ్రిపు ఇరిగేషన్ ద్వారానైనా తడి అందించేందుకు అవస్థలు పడుతున్నాను. వర్షాలు రాకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్ధం కావటం లేదు.

**ఎదురుచూస్తున్నాం : చంద్రకాని మధు, రైతు, బైరవునిపల్లి.**



గతేడాది మాదిరిగానే ఈ ఏడాడి కూడ ముందస్తుగా ఆరు ఎకరాలలో పత్తి విత్తనాలు విత్తుకున్నాం. కానీ వారం రోజుల నుంచి వర్షాల కోసం ఎదురు చూస్తున్నాం. వరుణు దేవుడు కరుణిస్తే తప్ప...రైతులకు పత్తి పంట వచ్చే అవకాశం లేదు. భారం అంతా వరుణు దేవుడు పైనే వేశాం.

**రైతులకు పత్తి విత్తనాలు ఉచితంగా అందించాలి :**
**కర్నాటి భానుప్రసాద్, రైతు సంఘం నేత, నేలకొండపల్లి.**



పత్తి విత్తనాలు విత్తిన రైతులకు వర్షాలు లేక నష్టపోయారు. పత్తి రైతులకు పత్తి విత్తనాలను ఉచితంగా అందించాలి. పత్తి విత్తనాలు కూడ అందుబాటులో లేవు. అదే విధంగా నకిలీ పత్తి విత్తనాలను అరికట్టాలి. పత్తి రైతులకు పరిహారం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# పద్మకు నివాళులర్పించిన పోటు రంగారావు



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండల పరిధిలోని కాచిరాజుగూడెం గ్రామానికి చెందిన సిపిఐ (ఎంఎల్)నాయకురాలు మలీదు పద్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతి పట్ల సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు నివాళులర్పించారు. ఆదివారం కాచిరాజుగూడెంలోని వారి స్వగృహంకు వెళ్లి పోటు రంగారావు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు గోకినేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు ఆవుల అశోక్, బందెల వెంకయ్య, మనోహర్, గ్రామానికి చెందిన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలపాటి ప్రసాద్‌ను సత్కరించిన ఎమ్మెల్యే జారే



**ప్రజాపక్షం/దమ్మపేటః** ఆయిల్ ఫామ్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా ఆలపాటి ప్రసాద్ ను నియమించడం పట్ల ఆదివారం దమ్మపేట మండలం అల్లిపల్లిలోని ఆలపాటి నివాసంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆలపాటిని కలుసుకుని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కేవీ సత్యనారాయణ, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# దమ్మపేటలో మెచ్చా జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/దమ్మపేటః** అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను దమ్మపేట టౌన్ లో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏ ఎమ్మెల్యే చేయని విధంగా నియోజకవర్గాన్ని మెచ్చా అభివృద్ధి చేశారని, సెంట్రల్ లైటింగ్, కోర్టు, అనేక సిసి రోడ్లు మరెన్నో అభివృద్ధి పనులు మండలంలో చేపట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దొడ్డా రమేష్, ఉపాధ్యక్షులు గాజుబోయిన ఏసు, అబ్దుల్ జిన్నా, యార్లగడ్డ శ్రీను, పాకనాటి శ్రీను, కోఆప్షన్ ఎంపీటీసీ బుడే, వాడపల్లి నాని, రూపా, రాంబాబు, జలగం మనోజ్, ఇప్ప శేషాద్రి, కిన్నెర నాగరాజు, లక్ష్మి నారాయణ, రెపల్లి వెంకటేశ్వరరావు, విభూది సాయి, భూక్యా రాజు తదితరులు పాల్గొన్నారు.

# గోవధ నిషేదం అమలు చేయాలి



**ప్రజాపక్షం/దమ్మపేటః** గోవధను దేశమంతటా నిషేధించాలని తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు దమ్మపేట మండలంలో నిషేధం అమలు చేయాలని, నిబంధనను ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం బిజేపి మండల నూతన అధ్యక్షులు పూచి ప్రసాద్, ఉపాధ్యక్షులు నాగరాజు నాయకత్వంలో దమ్మపేట ఎస్ఐని కలిసి మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిజేపి మండల సెక్రెటరీ దొడ్డ సతీష్, మండల మహిళా జనరల్ సెక్రటరీ సున్నం మేరీ, సీనియర్ నాయకులు ఉడతనేని విశ్వేశ్వరరావు, దారా నాగేశ్వరరావు, కొప్పుల వెంకట్, పల్లపు వెంకట్ , వాసం పోలయ్య, చిలకా నరసింహారావు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# టియుడబ్ల్యూజె రాష్ట్ర మహాసభలకు ముమ్మర ఏర్పాట్లు

**-ఆహ్వాన కమిటీ అధ్యక్షులుగా డాక్టర్ కూరపాటి**
**-సలహాదారునిగా రాంనారాయణ**
**-ఆహ్వాన సంఘ కార్యదర్శిగా వనం, కోశాధికారిగా ఏనుగు**
**-సభల విజయవంతానికి సబ్ కమిటీలు**






**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఐజెయు) రాష్ట్ర మహాసభలకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 19, 20 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే మహాసభలకు ఖమ్మం నగరం అతిథ్యమివ్వనున్న సంగతి విధితమే. మహాసభలను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహా సభల ఆహ్వాన కమిటీ అధ్యక్షులుగా ప్రముఖ వైద్యులు, సామాజిక వేత్త కూరపాటి ప్రదీప్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా వనం వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఏనుగు వెంకటేశ్వరరావు మహాసభల నిర్వహణకు సంబంధించి సలహాదారుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రాంనారాయణ ను ఎన్నుకున్నారు. 150 మందితో ఆహ్వాన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో సీనియర్ జర్నలిస్టులు, వివిధ వర్గాల ప్రముఖులు, ట్రేడ్ యూనియన్ నాయకులు ఉన్నారు. టియుడబ్ల్యూజె నాయకులు రవీంద్ర శేషు, నర్వనేని వెంకట్రావు, మాటేటి వేణుగోపాల్, నలజాల వెంకట్రావు, సామినేని కృష్ణ మురారి, ఖదీర్, మైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, మామిడాల భూపాల్, గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మహేందర్, మోహినుద్దీన్, నామ పురుషోత్తం, శివానంద, జనార్ధనాచారి, కె. వెంకటేశ్వర్లు, ఏలూరి వేణుగోపాల్, కళ్యాణ్, ఆలస్యం అప్పారావు, జాకీర్, కమటం శ్రీనివాస్, శీలం శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా కమిటీ ఏర్పాటైంది. గతంలో రెండు పర్యాయాలు అతిథ్యమిచ్చిన ఖమ్మంజిల్లా లో మూడవ మహాసభలు జరుగుతుండడంతో జిల్లా సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి మహాసభలకు ఏర్పాట్లు చేస్తుంది. మహాసభలలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి, వద్దిరాజు రవిచంద్ర, పార్థసారధిరెడ్డి, ఎంపి రఘురాం రెడ్డి, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, ఎంఎల్‌సి తాతా మధు, జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం, పోటు రంగారావు, తానా మాజీ అధ్యక్షులు జయశంకర్, నగర మేయర్ పునుకొల్లు నీరజ లతో పాటు ఐజెయు నాయకులు బల్విందర్ సింగ్ జమ్ము, ఎస్ఎన్ సిన్హా, దేవులపల్లి అమర్, ఎంఎ మాజీద్, వై. నరేందర్ రెడ్డి, డి. సోమసుందర్, కె. సత్యనారాయణ, సురేష్‌కుమార్, నగునూరి శేఖర్, కె. విరహత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

**సబ్ కమిటీల ఏర్పాటు ...**

మహాసభల విజయవంతం కోసం ఎనిమిది సబ్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు టియుడబ్ల్యూజె జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు తెలిపారు. ఫుడ్ కమిటీ ఛైర్మన్‌గా సామినేని మురారి, వసతుల కమిటీ ఛైర్మన్‌గా మాటేటి వేణుగోపాల్, ప్రోటోకాల్ కమిటీ కన్వీనర్‌గా నర్వనేని వెంకట్రావు, ఆర్థిక వనరుల కమిటీ కన్వీనర్‌గా ఏనుగు వెంకటేశ్వరరావు, కో కన్వీనర్లుగా వనం వెంకటేశ్వర్లు, మాటేటి వేణుగోపాల్, ఖదీర్, ప్రచార కమిటీ కన్వీనర్‌గా మైసా పాపారావు, జ్ఞాపికల కమిటీ కన్వీనర్‌గా నలజాల వెంకట్రావు, మీడియా కమిటీ కన్వీనర్‌గా మోహినుద్దీన్, కో కన్వీనర్‌గా నామ పురుషోత్తం, రవాణా కమిటీ ఛైర్మన్‌గా చెరుకుపల్లి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఎనిమిది కమిటీలకు సంబంధించి 64 మంది సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం

**-డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క**
**-పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన**




**ప్రజాపక్షం/బోనకల్‌:** అభివృద్ధి,సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని డిప్యూటీ సిఎం, ఆర్థిక,విద్యుత్ మంత్రివర్యులు మల్లుభట్టీ విక్రమార్క అన్నారు. మండలంలోని మోటమర్రి, పెద్దబీరవల్లి, తూటికుంట్ల గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు ఆయన ఆదివారం శంఖుస్థాపన చేశారు. ముందుగా మోటమర్రి గ్రామం నుండి కోనాయిపాలెం వరకు బిటి రోడ్డుకు రూ.2 కోట్ల 26 లక్షల 50 వేలతో శంఖుస్థాపన చేశారు. పెద్ద బీరవల్లి గ్రామంలో జగ్గయ్యపేటవైరా ప్రధాన రహదారి నుండి గ్రామంలోకి రూ. 81లక్షలతో బిటి రోడ్డుకు శంఖుస్థాపన చేశారు. తూటికుంట్ల గ్రామం నుండి వల్లాపురం గ్రామం వరకు రూ.1కోటి 79 లక్షలతో బిటి రోడ్డుకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా అధిక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. మధిర నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ముందుంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ దొండపాటి నాగేశ్వరరావు, ఎస్ఇ ట్రాన్స్‌కో సురేందర్, పిఆర్ఎస్ఇ చంద్రమౌళి, ఇఇ వెంకటరెడ్డి, కెవికె శ్రీనివాస్, తహసీల్దార్ పూర్ణచంద్రరావు, ఎంపిడిఓ ఎల్ రాజు, స్థానికప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

**సిపి సునీల్ దత్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బక్రీద్ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ముస్లిం సోదరుల సామూహిక ప్రార్థనలను దృష్టిలో ఉంచుకుని ఆదివారం నగరంలోని ఈద్గా, ఇతర ప్రాంతాల్లోని గొల్లగూడెం ఈద్గా ప్రాంతాన్ని, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రార్థన ప్రాంతాలను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. ట్రాఫిక్, పార్కింగ్, భద్రత పై నిర్వహాకులతో పాటు అధికారులతో చర్చించారు. ప్రత్యేక ప్రార్థన కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిపి తెలిపారు. పండుగ సందర్భంగా పార్కింగ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు పలు సూచనలు చేశారు. త్యాగానికి ప్రతీకగా ఈద్ ఆల్ ఆదా (బక్రీద్) పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. ముస్లిం సోదరులు జరుపుకునే రెండవ అతిపెద్ద పండుగ ఇదే అని తెలిపారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఖమ్మంజిల్లాలో పండుగ పర్వదినాన్ని శాంతియుత వాతావరణంలో పరస్పరం గౌరవించుకుంటూ జరుపుకోవాలన్నారు. బక్రీద్ సందర్భంగా ఈద్గాలో ప్రార్థనకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని మున్సిపల్ అధకారులతో కలిసి సౌకర్యాలు కల్పించినట్లు సిపి తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలతో సిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసిపి రమణ మూర్తి, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు, సిఐలు రమేష్, మోహన్‌బాబు, మత పెద్దలు షేక్ అబ్దుల్ రషీద్, షరీఫ్, ఇస్మాయిల్ సాబ్, డాక్టర్ అజీజ్ సాబ్, అఫ్జల్ సాబ్, డాక్టర్ నజీర్ సాబ్, మీరా సాబ్, ఫరీద్ ఖాద్రి, అబ్దుల్ రెహ్మాన్, మౌలానా, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# 37 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం




**ప్రజాపక్షం/ ఖమ్మం :** 37 సంవత్సరాల తర్వాత జరిగిన అపూర్వ సమ్మేళనం ప్రస్తుత స్థితిగతులను తెలుసుకుంటూనే మధుర స్మృతులను తలచుకుని మురిసిపోయింది. అప్పుడు అలా ఇప్పుడు ఇలా అంటూ ఒకరికొకరు ఆత్మీయ పలకరింపులతో సందడి చేశారు. ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ కళాశాలలో 1984 87 బియస్సి, బిజెడ్‌సి తెలుగు మీడియం చదివిన విద్యార్థుల ఆత్మీయ అపూర్వ సమ్మేళనం ఆదివారం ఖమ్మంలో జరిగింది. వివిధ రంగాలలో స్థిరపడిన వారు ఒకచోట కలుసుకుని ఒకరోజంతా ఆత్మీయంగా గడిపారు. తరచూ కలుసుకోవాలని నిరంతరం యోగక్షేమాలను తెలుసుకుంటూ ఒకరికొకరు దన్నుగా నిలవాలని సమ్మేళనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మమత వైద్య కళాశాలలో పనిచేస్తున్న సత్యనారాయణ రెడ్డి, ప్రముఖ సైకాలజిస్టు బండి గణేష్, జూలూరుపాడు ఎంపిడివో కరుణాకర్‌రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు కెవి కృష్ణారావు, బి.వెంకటేష్, సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్, ఉపేందర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాదులు గంగాధర్, రామానుజం, పిఆర్‌టియు జిల్లా కార్యదర్శి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# తాతా మధును పరామర్శించిన హరీష్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అనారోగ్యానికి గురైన శాసన మండలి సభ్యులు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ ను మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఆదివారం పరామర్శించారు. హైదరాబాద్‌లోని న్యూ ఎంఎల్ఏ క్వార్టర్స్ లోని తాతా మధు ఇంటికి వెళ్లి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఎల్‌సి దేశపతి శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, దేవిప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.